నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, బుధవారం 12 ఫిబ్రవరి 2025 | YADADRI BHUVANAGIRI

ముగిసిన టీచర్స్ ఎమ్మెల్సీ నామినేషన్ల పరిశీలన

ఒక్క నామినేషన్ తిరస్కరణ

నీలగిరి, ఫిబ్రవరి 11 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా కలెక్టరేట్‌లోని ఎన్నికల సాధారణ పరిశీలకుడు అహ్మద్ నదీమ్ సమక్షంలో మంగళవారం నామినేషన్ల పరిశీలన ముగిసింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించగా 23 మంది అభ్యర్థులు మొత్తం 50 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తండు ఉపేందర్ నామినేషన్ పత్రాలపై సంతకం లేని కారణంగా రిటర్నింగ్ అధికారి నామినేషన్‌ను తిరస్కరించారు. దాంతో బరిలో 22 మంది మాత్రమే నిలిచారు. నామినేషన్ల ఉనసంహరణకు గురువారం వరకు గడువు ఉంది. కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణఅమిత్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట: వంగపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

కాంగ్రెస్ పార్టీకి కర్రుకాల్చి వాత పెట్టాలి

- బీసీలంతా పోరాటానికి సిద్ధం కావాలి
- మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 11 : కాంగ్రెస్ పార్టీకి కర్రుకాల్చి వాత పెట్టేందుకు బీసీలు సిద్ధం కావాలని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. మండలంలోని చొల్లేరు గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో విలేకరులతో ఆమె మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని రాహుల్ గాంధీ, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ఇప్పించారని, దేశంలో ఎక్కడా లేనివిధంగా బీసీ కులగణన చేస్తామని రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. కానీ కులగణన తప్పుల తడక ఉందని, దామాషా ప్రకారం పొంతన లేకుండా కుంటి సాకులు చెప్పి ఒక్కరోజు అసెంబ్లీ తీర్మానం పేరుతో బీసీలను మోసం చేశారని మండిపడ్డారు. తప్పుల తడకగా ఉన్న కులగణన పత్రాలను చదివి నామమాత్రంగానే ముగించారన్నారు. 42 శాతం రిజర్వేషన్ అమలు కావాలంటే పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొంది రాజ్యాంగ సవరణ జరుగాలని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తరపున బీసీలకు 42 శాతం సీట్లను ఇస్తామంటూ మరో మోసానికి తెర లేపారని మండిపడ్డారు. బీసీలకు న్యాయం చేసేందుకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. బీసీ పక్షపాతిగా బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం పని చేస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేయకపోతే కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టేందుకు బీసీలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. అంతకుముందు చొల్లేరు గ్రామానికి చెందిన దివంగత నేత, బీఆర్ఎస్ మాజీ జడ్పీటీసీ కొక్కలకొండ యాదగిరి కుమారుడు కొక్కల కొండ మల్లేశ్ గుండెపోటుతో మరణించగా, ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ కసావు శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, మాజీ సర్పంచ్ తోటకూరి బీరయ్య, బీఆర్ఎస్ నాయకుడు ర్యాకల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుండ్రాంపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

తప్పుల తడకగా కుల గణన సర్వే

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు
- కొడంగల్ నుంచే రేవంత్ పతనం
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

చిట్యాల, ఫిబ్రవరి 11 : రేవంత్ ప్రభుత్వం కుల గణన పేరుతో తప్పుడు సర్వే చేయించి బీసీలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. మండలంలోని గుండ్రాంపల్లిలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పుల తడకగా ఉన్న కులగణనను రద్దు చేసి, మళ్లీ సర్వే చేయించాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేసి, చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనకు ప్రజలే గట్టిగా సమాధానం చెబుతున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణ పాఠం చెప్పడానికి ఎదురు చూస్తున్నారని తెలిపారు. కొడంగల్ నుంచే రేవంత్‌రెడ్డి పతనం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మీద ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో నిన్న జరిగిన రైతు మహాధర్నానే నిదర్శనమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పథకాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం హడావిడి చేసిందని, కానీ సంక్షేమ పథకాల్లో పెడుతున్న కోతలను చూసి విసుగెత్తిన ప్రజలు రేవంత్ సర్కారుకు కోతలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దరఖాస్తుల పేరిట 14 నెలల కాలయాపన చేశారని, కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేసి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రేషన్ కార్డులు, ఇండ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా వంటి సంక్షేమ పథకాలను, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీలే గాక ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు మోసపోయారని పేర్కొన్నారు. హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతూ కాలం గడుపుతున్నదే తప్ప వారికి చేసిన మేలు ఏమీ లేదని విమర్శించారు. సమావేశంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తుల నర్సింహ, మాజీ ఎంపీటీసీ కోయగూర నర్సింహ, కొలను వెంకటేశ్, జలంధర్‌రెడ్డి, కొలను సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు లేక ఎండుతున్న పంటలు

రాజాపేట, ఫిబ్రవరి 11 : సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లు పోయక నాట్లు వేసిన నెలరోజులకే పంటలు ఎండుముఖం పట్టాయి. రాజాపేట మండల కేంద్రానికి చెందిన రైతు గొల్లపల్లి శ్రీనివాస్ తనకున్న మూడు ఎకరాల్లో వరి సాగు చేయగా, ఉన్న ఒక్క బోరు నీళ్లు లేక వట్టిపోయింది. సాగు చేసిన పంట అంతా ఎండిపోవడంతో కన్నీటి పర్యంతమవుతున్నాడు. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకపోవడంతో అప్పులు చేసి సాగు చేశానని, తీరా పంట ఎండిపోవడంతో నష్టమే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

రాజాపేటలో ఎండిన వరిపైరును చూని బాధపడుతున్న రైతు శ్రీనివాస్

హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

చౌటుప్పల్, ఫిబ్రవరి 11 : సీఎం రేవంత్ రెడ్డి సర్కారు ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల అమలులో ఎలాంటి చర్యలు లేవన్నారు. రైతు రుణమాఫీ రూ.10వేల కోట్లు వేయ్యలేదని, రైతు భరోసా కూడా అరకొరగా సాగుతుందని తెలిపారు. దళితులకు ఇస్తానన్న రూ.12లక్షలపై ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రతిపాదనలకు తగిన నిధులను ఇప్పటికీ విడుదల చేయలేదన్నారు. ఇకనైనా ఇటీవల ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీల అమలుకు తగిన నిధులు విడుదల చేయాలని, లేకపోతే సీపీఎం ప్రజలను చైతన్యం చేస్తూ పోరాటాలకు దిగుతుందని చెప్పారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ముమ్మాటికీ పేదల వ్యతిరేకమైనదని అన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర నాయకులు ఎండీ జహంగీర్, కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనూరాధ, బూర్గు కృష్ణారెడ్డి, ఎండీ పాషా, గంగాదేవి సైదులు, గోశిక కరుణాకర్, రాగీరు కిష్టయ్య, పల్లె మధుకృష్ణ, దండు అరుణ్ కుమార్, గోపగోని లక్ష్మణ్, చీరిక సంజీవరెడ్డి, కొండె శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో కోళ్ల లోడ్లపై నిఘా

కోదాడ రూరల్, ఫిబ్రవరి11 : పొరుగున ఉన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ కారణంగా వేలాదిగా కోళ్లు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆంధ్రా నుంచి తెలంగాణలోకి కోళ్ల లోడ్లు రాకుండా రాష్ట్ర సరిహద్దు అయిన సూర్యాపేట జిల్లా కోదాడ మండలం నల్లబండగూడెం శివారులోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద వెటర్నరీ బృందంతో తనిఖీలు చేపడుతున్నది. ఏపీ నుంచి కోళ్ల లోడ్లు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కోదాడ మండల పశువైద్యాధికారి భూక్యా మధు తెలిపారు.

సరిహద్దులో వ్యాన్‌ను పరిశీలిస్తున్న వెటర్నరీ డాక్టర్ మధు

ఉత్తమ్ ఇలాకాలో బోనస్ కోసం నిరీక్షణ

సన్నధాన్యం విక్రయించి 2 నెలలు పూర్తి

ఉమ్మడి జిల్లాలో రూ.47.86 కోట్లు పెండింగ్

నేటికీ సగం మందికి వర్తించని రూ.500 బోనస్

బోనస్ కోసం నిత్యం బ్యాంకుల చుట్టూ రైతుల చక్కర్లు

అదిగో.. ఇదిగో అంటూ అధికారుల దాటవేత

మండిపడుతున్న రైతులు

పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకే నేటికీ సన్నధాన్యం బోనస్ డబ్బులు అందలేదు. ధాన్యం విక్రయించి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ సగం మంది రైతులు బోనస్ కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ప్రభుత్వం ఇదిగో.. అదిగో.. అంటుండడంతో నిత్యం బ్యాంకుల చుట్టూ తిరిగి విసుగెత్తుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 10వేల మందికిపైగా రైతులు రూ.47.86 కోట్ల బోనస్ డబ్బులు చెల్లించాల్సి ఉంది. కానీ ఈ బోనస్ డబ్బులపై పౌర సరఫరాల శాఖ గానీ, జిల్లా అధికార యంత్రాంగం గానీ ఏమీ చెప్పకపోవడంతో రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. ప్రభుత్వ హామీ ప్రకారం తమకు అందాల్సిన బోనస్ డబ్బును వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

– నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి11(నమస్తే తెలంగాణ)

ధాన్యం కొనుగోళ్లు (ఫైల్)

వ్యవసాయ రంగంతోపాటు రైతాంగం విషయంలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనలు ప్రచార ఆర్భాటానికే పరిమితమైనట్లు స్పష్టమవుతున్నది. ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే రైతులు పండించిన ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన మాట అందరికీ తెలిసిందే. కానీ అధికారంలోకి రాగానే 2024 మార్చి సీజన్ యాసంగిలో బోనస్‌ను గురించే పట్టించుకోలేదు. ఇక వానకాలం నుంచి అమలు చేస్తామని చెప్పుకు వచ్చారు. తీరా అన్ని రకాల ధాన్యానికి బోనస్ కాదూ... కేవలం సన్న ధాన్యానికి మాత్రమే అంటూ మెలిక పెట్టారు. అది కూడా తాము ఎంపిక చేసిన వెరైటీలకే అన్నారు. పైగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మితేనే ఇస్తామని ప్రకటించారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రుల మాటలను అప్పుడే రైతులు విశ్వసించలేదు. ప్రభుత్వంపై నమ్మకం లేకనే... బోనస్ వద్దనుకునే ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులు సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం నేరుగా రైస్‌మిల్లర్లకే విక్రయించారు. కానీ చివర్లో కొంతమంది రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నాలను విక్రయించగా వారికి నేటికీ బోనస్ డబ్బులు అందకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తేనే బోనస్ వస్తుందని ఆశపడి అనేక ఇబ్బందులకు ఓర్చి అన్నదాతలు ధాన్యం విక్రయించారు. నేరుగా రైస్‌మిల్లర్లకు విక్రయించినా మద్దతు ధరకు మించి ధర వస్తున్నా సరే... బోనస్ కోసం ఆశ పడితే రెంటికి చెడ్డ రేవడిలా పరిస్థితి తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం రుణమాఫీని పూర్తిగా అమలు చేయలేదు. ఇక రైతుభరోసా విషయంలోనూ మభ్యపెడుతూ వస్తున్నది. ప్రకటించిన విధంగా బోనస్ అయినా ఇస్తారనుకుంటే దానికి కూడా ఎదురు చూపులు తప్పడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.47.86కోట్లు పెండింగ్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.47.86 కోట్ల బోనస్ డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయి. వానకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో కొద్దిమంది రైతులే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సన్నధాన్యం తెచ్చారు. మెజార్టీ రైతులు కొనుగోలు కేంద్రాల్లోని షరతులకు భయపడి నేరుగా రైస్‌మిల్లర్లకే అమ్ముకున్నారు. కొంతవరకు మాత్రం చివర్లో వచ్చిన సన్నాలను బోనస్ కోసం విక్రయించారు. ఇలా నల్లగొండ జిల్లాలో మొత్తం రూ.172.59కోట్ల విలువైన 74,393 మెట్రిక్ టన్నుల సన్నాలను 15,879 మంది రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసింది. వీటికి క్వింటాలు ఒక్కంటికి రూ.500 బోనస్ వర్తింపచేస్తే రూ.37.20 కోట్లు రైతులకు బోనస్‌గా అందాల్సి ఉంది. కానీ నేటికీ 37,186 మెట్రిక్‌టన్నులకు సంబంధించిన 8,110 మంది రైతులకు రూ.37.60 కోట్ల బోనస్ డబ్బులు అందలేదు. 50 శాతం సన్నాలకు మాత్రమే చెల్లింపులు జరిగాయి. సూర్యాపేట జిల్లాలో 1.18లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలను కొనుగోలు చేయగా రూ.59కోట్ల రూపాయల బోనస్ రైతులకు చెల్లించాల్సి ఉంది. ఇక్కడ కూడా రూ.30 కోట్లు మాత్రమే చెల్లించారు. మిగతా 29 కోట్ల రూపాయలను పెండింగ్‌లో పెట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో కొనుగోలు చేసిందే చాలా తక్కువ. 1,171 మంది రైతుల నుంచి 4,647 మెట్రిక్ టన్నుల సన్నాలను కొనుగోలు చేశారు. వీటికి సంబంధించి నేటికీ రూ.2.32 లక్షల బోనస్ డబ్బులు పెండింగ్‌లో ఉండడం గమనార్హం.

బోనస్ ఎప్పుడు ఇస్తరో చెప్తలేరు

నేను రెండున్నర ఎకరాల్లో పండిన 27 క్వింటాళ్ల సన్న ధాన్యాన్ని అర్వపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వం కొనుగోలు కేంద్రంలో అమ్మాను. నెల రోజులు దాటినా బోనస్ పడలేదు. అధికారులకు ఫోన్ చేస్తే వస్తుందంటున్నారు తప్ప అకౌంట్‌లో వేయడం లేదు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు మా చేతుల్లో ఏం లేదంటున్నారు. ఎవరికి చెప్పుకోవాలో అర్థమైతలేదు.

-లొడంగి భిక్షం, రైతు, కాసర్ల పహాడ్ (అర్వపల్లి మండలం)

రెండు నెలలైనా బోనస్ లేదు

ప్రభుత్వం చెప్పినట్లు సర్కారు కొనుగోలు కేంద్రంలోనే 69 క్వింటాళ్ల సన్నవడ్లు అమ్మాను. క్వింటాకు 500 రూపాయలు బోనస్ ఇస్తామని చెప్పి రెండు నెలలు దాటింది. ఇప్పటివరకూ అకౌంట్‌లో పడలేదు. రోజూ బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాం. యాసంగి సీజన్‌కు పెట్టుబడి లేక ఇబ్బంది పడుతున్నాం. రైతు భరోసా కూడా రాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బోనస్ ఇవ్వాలి.

-సత్తయ్య, రైతు, నాగారం

అసలు బోనస్ ఇస్తరా, ఇయ్యరా?

ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తామని చెప్పడంతో 50 క్వింటాళ్ల ధాన్యం కట్టంగూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. వారం రోజుల్లో బోనస్ డబ్బులు ఖాతాల్లో పడుతాయని చెప్పారు. రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు రాలేదు. బోనస్ వస్తుందన్న ఆశతో తక్కువ దిగుబడులు వచ్చినా అధిక పెట్టుబడులు పెట్టి సన్నాలు సాగు చేశాను. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బోనస్ పేరుతో రైతులను మోసం చేస్తున్నది. అధికారులను అడిగితే రేపు, మాపు అంటూ సమాధానం దాటవేస్తున్నారు. బోనస్ డబ్బులు అసలు ఇస్తరో, ఇయ్యరో తెలియడం లేదు.

-చిట్యాల రాజిరెడ్డి, రైతు, నారెగూడెం (కట్టంగూర్ మండలం)

తరుగే తప్ప బోనస్ రాలేదు

ఎకరం పొలం కౌలుకు తీసుకొని సన్న రకం నాటు పెట్టిన. పండిన పంటను నేరుగా దామరచర్ల ఐకేపీ కేంద్రానికి తీసుకుపోతే వారం రోజులు తప్పి కాంటా పెట్టారు. 16 క్వింటాళ్లు వడ్లు అయినయి. ధాన్యం డబ్బులు ఇచ్చినరు గానీ ఇంత వరకు బోనస్‌గా రావల్సిన 8వేల రూపాయలు రాలేదు. పొలం కౌలుకు ఇచ్చిన రైతు బోనస్‌తో కలిపి డబ్బులు తీసుకున్నడు. నాకు మాత్రం బోనస్ డబ్బులు రాలేదు. ఐకేపీ కేంద్రంలో అమ్మడంతో ధాన్యం తరుగుపోయింది. ఇప్పుడు బోనస్ రాక మరింత నష్టపోతున్నా.

-పడిగెపాటి సైదిరెడ్డి, రైతు, దామరచర్ల

మిల్లుకు అమ్ముకున్నా బాగుండేది

వానకాలం సన్న వడ్లకు బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పడంతో మిల్లర్లు మంచి రేటు పెడుతున్నా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో 212 టిక్కీలు అమ్మాను. ఇప్పటికి 50 రోజులైంది. బోనస్ పడలేదు. తోటి రైతుల లెక్క మిల్లుకు అమ్ముకున్నా మంచి రేటు పడేది అనిపిస్తున్నది ఇప్పుడు. ఉన్నది పాయె. బోనస్ రాకపాయె.

-వట్టం తిరుపతయ్య, రైతు, కూచిపూడి గ్రామం(కోదాడ రూరల్)

కుల గణన అశాస్త్రీయం.. అస్తవ్యస్తం

- ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మళ్లీ సర్వే చేయాలి
- ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు వంత పాడుతున్న గుత్తా
- చట్టబద్ధత ముఖ్యం కాదు.. పారదర్శకత ఎంత?
- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

హాలియాలో విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

హాలియా, ఫిబ్రవరి 11 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన అస్తవ్యస్తంగా, అశాస్త్రీయంగా ఉందని, చిత్తశుద్ధి ఉంటే వెంటనే దాన్ని రద్దు చేసి మళ్లీ సమగ్రంగా కుల గణన చేపట్టాలని నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం హాలియలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన పారదర్శకంగా లేదన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 3.6 కోట్లు కాగా, 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 3.68 కోట్లుగా తేలిందన్నారు. 2024లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన కుల గణనలో రాష్ట్ర జనాభా 3.70 కోట్లుగా చూపడం సరికాదని పేర్కొన్నారు. డీలిమిటేషన్ కమిషన్ లెక్క ప్రకారం రాష్ట్ర జనాభా వార్షిక వృద్ధి రేటు 1.35 శాతం ఉందని, గత 13 సంవత్సరాల్లో రాష్ట్ర జనాభా వృద్ధిరేటు 1.95 శాతంగా ఉండవచ్చునని తెలిపారు. పదేండ్లలో రాష్ట్ర జనాభా 2 లక్షల మంది మాత్రమే పెరిగిందని చెప్పడంతోనే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన ఎంత పారదర్శకంగా ఉందో అర్థమవుతుందని విమర్శించారు. 2014లో బీసీలు 51 శాతం ఉంటే, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు చేపట్టిన కులగణనలో 46 శాతానికి ఎలా తగ్గుతారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీతోపాటు రాష్ట్రంలోని అన్ని బీసీ కులాలన్నీ ప్రభుత్వ కులగణనను చిత్తుకాగితంగానే పరిగణిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం పరిపాలన వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు కులగణన నివేదికను బయటపెట్టింది తప్ప బీసీలపై చిత్తశుద్ధి లేదన్నారు. ఏ రాజకీయ ప్రయోజనాలను కాంగ్రెస్ ఆశించిందో.. అదే బీసీలు రేపటి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టబోతున్నారని చెప్పారు.

గుత్తా వ్యాఖ్యలపై ఫైర్

ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన కులగణనకు చట్టబద్ధత ఉందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు చట్టబద్ధత లేదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడడం సరికాదని మాజీ ఎమ్మెల్యే భగత్ అన్నారు. రాష్ట్రంలోని బీసీలంతా కులగణన నివేదినపై దుమ్మెత్తి పోస్తుంటే మండలి చైర్మన్ గుత్తా మాత్రం చట్టబద్ధత ఉందంటూ ప్రభుత్వానికి వంత పాడుతున్నారని విమర్శించారు. ఇక్కడ చట్టబద్ధత ప్రధానాంశం కాదని, ఎంత పారదర్శకంగా ఉంది, ఎంత శాస్త్రీయంగా ఉంది అన్నదే ముఖ్యమని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో కులగణన చేపట్టిన అధికారులే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ సమగ్ర కుటుంబ సర్వే చేశారన్న విషయాన్ని సుఖేందర్‌రెడ్డి మరిచిపోవద్దన్నారు. తప్పుల తడకగా ఉన్న కులగణన నివేదికను సరిదిద్దాలని ప్రభుత్వాన్నికి సూచించాల్సింది పోయి ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం ఆయన స్థాయికి సరికాదని పేర్కొన్నారు. సమావేశంలో హాలియా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, నిడమనూరు మాజీ ఎంపీపీ సలహాదారుడు బొల్లం రవి, బీఆర్ఎస్ పెద్దవూర మండలాధ్యక్షుడు జఠావత్ రవినాయక్, హాలియా పట్టణాధ్యక్షుడు వడ్డె సతీశ్‌రెడ్డి, త్రిపురారం మండల ప్రధాన కార్యదర్శి పామోజు వెంకటాచారి, నాయకులు బొల్లం సైదులు, సురభిరాంబాబు, మండల యూత్ అధ్యక్షుడు కాట్నం నాగరాజుగౌడ్, శ్రీకర్‌నాయక్, ఉపేందర్, భాస్కర్ పాల్గొన్నారు.